## మినీకథ

# నెమలి కన్నీళ్ళు



తలుపు దబదబా బాదిన చప్పుడవుతుంది. వరండాలో చల్లగాలికి మంచం వాల్చుకుని పడుకున్న కోడలు ఉలిక్కిపడి లేచి కళ్ళు నలుముకుంది.

కొద్ది దూరంలో మేను వాల్చిన సుశీలమ్మ కూడ నిదుర రాక మెదులుతుంది మంచంలో

నింగిలో మెరుస్తున్న తారల వంక చూసిందామె. ఒకప్పుడు తన గుండెలో మెరిసిన కోటి తారకలు తలుపుకు వచ్చాయి ఆమెకు

కోడలు లేచి వెళ్లే లోపే అసహనంతో బాదుతున్నట్టుగా తలుపు ఊగిపోతుంది.

సుశీలమ్మ నిట్టూర్చింది.

బంగారు కలలన్నీ కరిగిపోయాయి

కరిగిన కలల మరో రూపమే కన్నీళ్లు

సరిగ్గా పాతిక సంవత్సరాల క్రితం

ఇలాంటి రోజు ఒకటుండదని తానూహించింది.

కమ్మని కలల భారంతో భవిష్యత్ వైపు ఆశాదృక్కులు సారించింది.

త్వరలో మద్యపాన నిషేధం అన్న వార్త పేపరులో చదివినప్పుడు తన మనసూ, శరీరమూ వులకించిపోయింది. కష్టాల కడగండ్లను దాటి జీవితనౌక సురక్షిత మార్గంవైపు పయనిస్తోందన్న ఊహ తనని ఓ చోట నిలువనీయలేదు. పేపరు పట్టుకుని వీధిలోకి పరుగుతీసింది. ఆ ఊళ్లో అమ్మలక్కలందరికీ చదివి విన్పించింది. తన లాగే ఆ అభాగినుల కళ్లల్లో ఆనందపు కాంతులు విరజిమ్మాయి.

కాని ఆ తర్వాత తెలిసింది.

తమ కన్నీటిని అడ్డం పెట్టుకుని శపథం చేసి మరీ పదవిలోకి వచ్చిన ప్రభుత్వం మద్యపాన నిషేధాన్ని కంటి తుడుపు చర్యగా మాత్రమే చేపట్టిందని

సంపూర్ణ మద్యపాన నిషేధం కొన్ని సడలింపులు, కొన్ని మినహాయింపులు

ఇవన్నీ పేపర్లో చూసి అచ్చెరువొందింది తాను

వీటన్నింటి మధ్య నిషేధం సక్రమంగా అమలు జరిగేనా అని తాను దిగులు చెందుతుండగానే విచిత్రంగా తన జీవితమే ఓ మెలిక తిరిగింది.

ఆయనకు తాగుడు అధికమైంది. అసలే దెబ్బ తిని కోలుకున్న ప్రాణం. ఒద్దంటే వినరు.

నిషేధ వార్త విన్నప్పట్నుండి ఇంక దొరకదేమోనన్న బెంగతో అధికమైన తాగుడు, నిషేధానంతరం ఆ ధరల వేడికి తట్టుకోలేక చీప్ లిక్కర్‌లోకి దిగింది.

డాక్టర్ సజెషన్ మేరకు మందుకు దూరంగా వున్న ఆయనను మద్యపాన నిషేధం ప్రకటన అలా బరిలోకి లాగి బలిగొంది.

తన కన్నీటికి అంతే లేదు.

తడి ఆరని కన్నీట్లో తళుక్కుమంటూ ఓ చిన్న ఆశారేఖ తన జీవితమిలా అయిపోతేనేం-తన దురదృష్టమది

తన ఒళ్ళో గుప్పెట్లు మూసుకుని పడుకుని వున్న ఈ చిన్నబాబుకు బంగారు భవిష్యత్ ఉంది. ఎంతయినా నిషేధం అమల్లోనే వుంది కదా అందుకే వీడు తండ్రిలా మందుకు బానిసకాడు.

గుప్పుమనే వాసనతో, నిప్పు కణికల్లాంటి కళ్లతో, అర్థం లేని ప్రేలాపనతో ఒక్కోమారు పెచ్చు మీరిన పైశాచికత్వంతో వాడ్ని చూసే స్థితి తనకు రాదు.

చాలు. ఆ చిన్న ఆశ చాలు. తన జీవితమంతా ఆ ఆశ మీదే దృష్టి కేంద్రీకరిస్తుంది. బాబును జాగ్రత్తగా పెంచుకుంటుంది.

విరిగి పడుతున్నంత వేగంగా మళ్లీ తలుపు లబలబలాడింది.

సుశీలమ్మ ఉలిక్కిపడి ఈ లోకం లోకి వచ్చింది.

"అత్తయ్యా! నాకు భయమేస్తుంది. మీరే వెళ్లి తలుపు తీయండి" అంది కోడలు

సుశీలమ్మ వెళ్లి తలుపు తీసింది.

అతను లోపలికి వచ్చాడు

మద్యపాన నిషేధం ఎత్తివేసిన ప్రభుత్వం పుణ్యమా అని తన భర్తనే కాదు, కొడుకును కూడా ఆ రాకాసి కోరలకు అప్పగించాల్సి వచ్చింది.

కొండంత ఆశ పెట్టుకుని పెంచినా, కొడుకు తండ్రి దోవకే వెళ్లిపోయాడు.

లోపల్నుంచి ఏవో అరుపులు, కేకలు, గిన్నెలు విసిరిన శబ్దం. దబదబమంటూ దెబ్బల శబ్దం

కోడలు ఏడుస్తుంది.

అనాదిగా ఆడది ఏడుస్తూనే వుంది.

మద్యం మంటల వేడికి మసి అవుతున్న మగవాడ్ని చూడలేక, తనని సైతం ఆ సెగల బారి నుండి రక్షించుకోలేక...

ఆమె కన్నీరు ప్రవాహమై సాగుతూనే వుంది

ఈ కన్నీటికి అంతం ఎప్పుడు?

ఆ కన్నీటికి కదిలేది ఎవరు?

చిత్తశుద్ధి కరువయిన ప్రభుత్వమా! కరడు గట్టిన మగవాని కాఠిన్యమా?

నెమలి కన్నీళ్లు చూస్తే వేటగాడికి తమాషా

తమని వేటగాడ్ని కదిలించలేని కన్నీళ్లు నెమలి కన్నీళ్ళు అనుకుంది సుశీలమ్మ.

-పువ్వాడ శారదాదేవి